# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-12-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. అనకాపల్లి జిల్లాలో నిర్వహించే 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పాల్గొంటారు.

2. ప్రజలకు స్వచ్ఛమైన, శుద్ధమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి కే.పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

3. యువతను ప్రభుత్వ వ్యవస్థలో భాగస్వాములను చేయడమే జెన్ జీ పోస్టాఫీసు లక్ష్యమని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ తెలిపారు.

4. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రభుత్వం కృషి చేస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి చెప్పారు.

5. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు పరిశుభ్రత అలవాట్లు నేర్పించేందుకు ప్రభుత్వం 'ముస్తాబు' కార్యక్రమాన్ని ఈరోజు నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తోంది.

==========================

అనకాపల్లి జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పర్యటిస్తున్నారు. తాళ్లపాలెంలో నిర్వహించే 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే ప్రజా వేదిక సభకు హాజరై స్థానికులతో మాట్లాడుతారు. అనంతరం పార్టీ ముఖ్య నాయకులతో భేటీ, మత్స్యకారులతో సమావేశం, అలాగే మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజపేయి విగ్రహావిష్కరణ వంటి పలు కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారని అధికారులు వెల్లడించారు.

--------------------------

ప్రజలకు స్వచ్ఛమైన, శుద్ధమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి కే.పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గంలోని పెరవలిలో అమరజీవి జలధార పథకానికి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అధికారులు ఉప ముఖ్యమంత్రికి ప్రాజెక్టు వివరాలను తెలియజేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి కే.పవన్ కల్యాణ్ మాట్లాడుతూ..

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

యువతను ప్రభుత్వ వ్యవస్థలో భాగస్వాములను చేయడమే జెన్ జీ పోస్టాఫీసు లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ అన్నారు. అమరావతిలోని విట్ విశ్వవిద్యాలయంలో జెన్ జీ పోస్టాఫీస్ ను కేంద్ర మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా దాదాపు 50 జెన్ జీ పోస్టాఫీసులు, రాష్ట్రంలో మూడు ఏర్పాటు చేసినట్లు కేంద్ర మంత్రి వివరించారు.

---------------------------

గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రభుత్వం కృషి చేస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా పొన్నలూరులో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పారు. ప్లాస్టిక్ రహిత స్వర్ణాంధ్రప్రదేశ్‌లో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు.

---------------------------

5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయించి పోలియోను నిర్మూలించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీ శ అన్నారు. విజయవాడలో పోలియో చుక్కల ప్రాధాన్యత పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల్లో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల పిల్లల వరకు రెండు పోలియో చుక్కలు వేయించాలని చెప్పారు. ఈనెల 22, 23 తేదీల్లో ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి మిగిలిన పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని కలెక్టర్ లక్ష్మీ శ చెబుతూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పరిశుభ్రత అలవాట్లు నేర్పించేందుకు ప్రభుత్వం 'ముస్తాబు' కార్యక్రమాన్ని ఈరోజు నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తోంది. విద్యార్థుల్లో వ్యక్తిగత శుభ్రత, మంచి అలవాట్లు, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంచే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇప్పటికే పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఆ జిల్లాలో సత్ఫలితాలు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వుల జారీ చేశారు.

---------------------------

విద్యా వ్యవస్థను రాజకీయాలకు దూరంగా ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రమంతా 'ముస్తాబు' కార్యక్రమం ఆచరణలోకి రావడం శుభపరిణామమని చెప్పారు. పిల్లల్లో వ్యక్తిగత పరిశుభ్రత, పర్యవేక్షణ ప్రధాన లక్ష్యంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. భవిష్యత్తు తరాల బాగుకు వినూత్న కార్యక్రమాలు ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

---------------------------

ఆకాశవాణి తిరుపతి కేంద్రంలో తాత్కాలిక అనౌన్సర్‌లుగా రోజువారీ పద్ధతిపై పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి ఆకాశవాణి స్టేషన్ డైరెక్టర్ ఎం.సుధాకర్ మోహన్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణత సాధించి, 21 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలు వయస్సు కలిగి తెలుగు, ఆంగ్ల భాషలపై పట్టు, స్వర మాధుర్యం, ఉచ్ఛారణలో స్పష్టత, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారు అర్హులని వివరించారు. వ్రాత పరీక్ష, స్వర పరీక్ష, మౌఖిక పరీక్షల ద్వారా ఎంపికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత, అనుభవ పత్రాలు, ఫోటోను జతపరచి ఈనెల 31వతేదీలోగా తిరుపతి ఆకాశవాణి కేంద్రానికి పంపించాలని విజ్ఞప్తి చేశారు.

---------------------------

దేశంలోని గ్రామీణ కుటుంబాలకు ప్రతి సంవత్సరం 125 రోజుల వేతన ఉపాధికి చట్టబద్ధ హామీ కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం "వికసిత్ భారత్ –గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవిక మిషన్ బిల్లు-2025 VB-G RAM G" ను ప్రవేశ పెట్టింది. ఈ బిల్లుకు నిన్న రాజ్య సభ ఆమోదం పొందగా, మొన్న లోక్ సభ ఆమోదించింది. దీంతో ఉభయ సభల్లో ఈ బిల్లు ఆమోదం పొందింది. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 95 వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేయనున్నట్టు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

---------------------------

రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్ గా మారుస్తున్నామని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)ఛైర్మన్ రవినాయుడు అన్నారు. తిరుపతిలోని భారతీయ విద్యా భవన్‌లో స్పోర్ట్స్ మీట్ ను ఈరోజు ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని శాప్ ఛైర్మన్ రవినాయుడు తెలియజేస్తూ..

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న 5 రోజులు పొడి వాతావరణం నెలకొనే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేశారు.

=====================